తాయెత్తు చుట్టూ అడ్డుగా ప్లాస్టిక్ కవర్ మూతపెట్టిన తర్వాత ఆమె అంది ఇది సార్ ఇంత కాలం స్వామి మన రహస్యాలు తెలుసుకున్న విధానం.

అతడు విభ్రాంతి నుంచి తెరుకోవటానికి చాలా సేపు పట్టింది. ఈ లోపులో ఆమె తనకు కావలింసిందంతా చెప్పింది.

అతడు తలూపాడు అంతా వెంటనే అమరుస్తానన్నట్టు.

తర్వాత ఆమె దీని వెనుక ఉన్న బ్రెయినంత పరమేశ్వరం సార్ అంటూ తిరిగి ప్లాస్టిక్ కవర్ విప్పింది.

పరమేశ్వరమా? అమ్మాయ్ ఇది నేను నమ్మలేకపోతున్నాను.

అవును సర్ తండ్రీ కొడుకులు ఎప్పుడో కలిసి పోయారు. తాయెత్తు నోటిదగ్గర పెట్టుకుంటూ అంది. ఆ రోజు రంగస్థలం మీద విహారి పద్మాకర్ కలిసి నాటకం వేస్తున్నప్పుడు పిస్తోలు మార్చినట్లు పరమేశ్వరం నటించాడు. కేవలం అది నటన మాత్రమే. అందుకే ఆ రోజు విహారి హత్య కేసులో ఇరుక్కోలేదు. రామ్‌లాల్‌నీ సుర్యరావునీ పడగొట్టమని సలహా ఇచ్చింది కూడా పరమేశ్వరమే. ఇంకో రెండు గంటలలో స్వామి అగ్నిప్రవేశం చేయబోతున్నాడు. మధ్యలో నిజమైన అగ్నే వుంటుంది. ఆ విషయం తెలియని స్వామి సజీవదహనం కాబోతున్నాడు ఇదికూడా పరమేశ్వరం ప్లానే సర్ .......ఒక్క విషయం మన డిపార్ట్‌మెంట్ రహస్యాలు ఎలాగో స్వామికి తెలిసిపోతున్నాయి. పరమేశ్వరం మనవేపుకి తిరిగిపోయాడన్న సంగతి మరో రెండు గంటలపాటు సీక్రెట్‌గా వుంచాలి.

అలాగే అమ్మాయ్.

ఆమె తిరిగి తాయెత్తుని ప్లాస్టిక్ కవరుతో మూసేసింది.

తను మాట్లాడిన ప్రతిమాటా స్వామికి చేరుతుందని ఆమెకి తెల్సు చీఫ్ దగ్గర శలవు తీసుకుని బయట కొచ్చేసింది.

అప్పటికి ఏడున్నర అయింది ప్రవల్లిక మనసంతా ఉద్వేగంతో నిండి వుంది. మరోగంటలో స్వామి అశేష ప్రజానీకం ముందు ఉపన్యాసమిస్తాడు. మారణహోమానికి ప్రారంభోపన్యాసం అప్పుడే అగ్నిలో స్నానం చేసి వచ్చి అతడు ఇవ్వబోయే ఉపన్యాసం దావానలంలా వ్యాపించబోతూంది.

జపాన్ నుంచి రాబోయే ఓడ భారతదేశపు తీరప్రాంతం చేరుకోగానే దాన్ని చుట్టుముట్టి సామాగ్రి ఆధీనం చేసుకునే ఏర్పాట్లు చేస్తున్నాడు చీఫ్. కాని ఆ ఓడ సంగతి తమకు తెలిసిందని స్వామికీ తెలిసింది కాబట్టి అందులో మామూలు ఆట వస్తువులే వుంటాయి నిశ్చయంగా.

ఆ రోజు పేపరు నగరంలో విడుదల కాకపోవటం ఒక అపశృతి. విహారి తన పని ఎంతవరకు పూర్తి చేస్తాడో వేచి చూడాలి. ఎంత కష్టపడినా ఇంకో రెండు గంటల్లో ఆ ప్రతుల్ని నగరానికి తీసుకురావటం కష్టం. ఒకవేళ ఆ పేపర్లు జనం చదివినా ఎలా రియాక్ట్ అవుతారన్నది

గిట్టని వారెవరో వ్రాసిన న్యూస్ అని జనం అనుకునే ప్రమాదం లేకపోలేదు.

సరీగ్గా ఎనిమిదింటికి ఆమె బయల్దేరింది. సభా ప్రాంగణానికి వెళ్ళలేదు. ఉత్తరం దిక్కుగా వెళ్ళింది.

తండ్రి సమాధి వుంది అక్కడ కారు దూరంగా ఆపి లోపలకు వెళ్ళి సమాధి ముందు కూర్చుంది. పైన ఆకాశంలో ఏదో పక్షి అరుస్తూ వెళుతూంది. శ్మశానం అంత నిర్మానుష్యంగా నిశ్శబ్దంగా వుంది. తన తల్లి తన ఆత్మీయులు ఎక్కడ మట్టిలో కలిసిపోయారో ఆమెకి తెలీదు. తండ్రి ఒక్కడే ఆమెకు పూర్తిగా తెలుసు. ఆ దారుణ దృశ్యాలు గుర్తున్నాయి. రామ్‌లాల్ గుర్తున్నాడు. రక్తం గుర్తుంది. రౌడీ రామ్‌లాల్ లాయర్ పరమేశ్వరం ఇద్దరి భుజాలమీద చెయ్యివేసి అనంతానంతస్వామి కోర్టునుంచి బయటకు రావటం గుర్తుంది.

ఆమె మోకాళ్ల మీద కూర్చొని చేతులు జోడించి గెడ్డాన్ని ఆ చేతుల మీద ఆన్చి కళ్ళు మూసుకుంది.

ఆ నిర్వికార నిరామయావస్థలో ఏదో శక్తి లోపల్నించి తన్ను కొస్తున్నట్లు అనిపించింది. సమాధి నుంచే తన తండ్రి ఆశీర్వదంతో అభిషేకిస్తున్నట్టు తోచింది. కొన్ని ఫీలింగ్స్‌కి లాజిక్ ఉండదు. అనుభూతి మాత్రం వాస్తవం.

అయిదు నిముషాల తర్వాత ఆమె లేచింది. పిస్తోలు వుందో లేదో చూసుకుని కారు స్టార్ట్ చేసి సభా ప్రాంగణానికి బయల్దేరింది.

ఆమె అక్కడికి చేరే సరికి సరీగ్గా ఎనిమిదింపావు అయింది. దాదాపు ఫర్లాంగు దూరం నుంచి ఇసుక వేస్తే రాలనంత జనం వున్నారు. దాదపు లక్షమంది వుంటారు. కొందరు ప్రార్థిస్తున్నారు. కొందరు స్వామిని స్తోత్రం చేస్తున్నారు. కొందరు చేతులు జోడించి భక్తి పారవశ్యంతో కనులు మూసుకుని నిలబడి వున్నారు ఆమె ఆ దృశ్యం చూసి స్థబ్దురాలైంది.

ఆమెకి స్వామి మాటలు గుర్తుకొచ్చాయి బలం తెలివి రాజకీయం నా మూడు స్తంభాలైతే నాలుగో స్తంభం ప్రజల అజ్ఞానం.

నిజమే అనిపించింది

భక్తి భావం గుండెల్లో నిక్షిప్తమైనంత వరకూ పూజలో ప్రతిబింబించేంత వరకూ పర్వాలేదు. మతతత్వం మూఢత్వంగా మారి వ్య క్తిపూజతో పరకాష్టనందితే కష్టం.

ఆమెకెందుకో ఓటమి తప్పదనిపించింది.

వెళ్ళు బలంగా నాటుకు పోయిన మహావృక్షం స్వామి చట్టానికి దొరక్కుండా అతడివ్వబోయే ఉపన్యాసం ఉత్తేజితమవబోతూన్న ప్రజలు ఢిల్లీలో పేలబోతూన్న గాడ్జెత్ మిస్సైల్స్ అన్ని వైపుల నుంచీ చుట్టుముట్టుతున్న ప్రమాదం .......

ఏం చెయ్యాలి?

ఆలోచిస్తూ ఆమె ముందుకు బెళుతూంది.

బారులు కట్టి వున్నారు జనం.

ఆమె దృష్టి ఒకచోట ఆగిపోయింది. అక్కడ సునాదమాల వుంది. అయితే ఆమె ఆగింది సునాదమాలని చూసి కాదు.

పక్కనున్న విష్ణుని చూసి ఆమెలో ఏదో ఆలోచన మెరుపులా మెరిసింది

*   * * *   *   *

పరమేశ్వరం భవంతి నుంచి బయటకు రావటానికి ఆయత్తమవుతున్నాడు. దూరం నుంచి జనం ఘోష వినిపిస్తూంది. సముద్రంలా వున్నారు జనం ఆ భవంతి అద్దాల్లోంచి దూరంగా అగ్నిగుండం కనబడుతూంది. మంటలు అకాశాన్నంటేలా ఎగిసిపడుతున్నాయి.

లోపల కూడా హడావుడిగా వుంది. అయితే రక్తంతాగే కిరాతకులు గూండాలు ఏవరూ లేరక్కడ స్వామిని మనసా వాచా నమ్మిన భక్తులే వున్నారు. గత కొద్దిరోజులు పరిణామాలు లేకపోతే సి.బి.ఐ. చీఫ్ కూడా వాళ్ళలో ఒకడుగా అక్కడ వుండేవాడు ప్రతిపక్షము అధికార పక్షమూ అసెంబ్లీ పార్లమెంట్ అన్న తేడా లేకుండా సభ్యులు మంత్రులు చాలా మంది అక్కడికి వచ్చారు.

స్వామి తన ఉపన్యాసాన్ని ఆఖరిసారి చదువుకుంటున్నాడు. నిజంగా దాన్ని చాలా గొప్పగా పరమేశ్వరం తయారు చేశాడు. ఇది మనదేశం మనదేశం ప్రతి శనివారమో శుక్రవారమో గుడికి వెళ్లటం కోసం మధ్యాహ్నం ఓ రెండు గంటలు అనుమతి ఇవ్వమంటే ప్రభుత్వ కార్యాలయాల్లో మన అధికారులు వప్పుకోరు .......

ఇలాగే ఆ ఉపన్యాసాం అక్కడ చేరిన లక్షలాది ప్రజల్నే కాక దేశం మొత్తాన్ని ఉత్తేజితం చేస్తుందనటంలో సందేహం లేదు. అదే సమయానికి తమ మనుష్యులే శత్రువులు వేసినట్టు ఆ జనం మీద బాంబులు వేయడంతో .......

స్వామి సంతృప్తిగా కాగితం మడిచి పక్కనున్న చాంబరులోకి వెళ్ళాడు. ప్రతిరోజు ప్రొద్దున్నే అక్కడికి వెళ్ళి రికార్డరు వినటం అతడి అలవాటు. అక్కడ అతడికి తప్ప మరొకరికి ప్రవేశం లేదు. ఎవరెవరు ఎక్కడెక్కడ మాట్లాడుకున్నదీ మైక్రోఫోన్‌ల ద్వారా వచ్చి అక్కడ రికార్డవుతాయి. మరుసటిరోజు ప్రొద్దున్నే అతను వింటాడు.

అలా వినటంలో గంట క్రితం ప్రవల్లిక సి.బి.ఐ చీఫ్ మధ్య జరిగిన సంభాషణ కూడా రికార్డర్ నుంచి వచ్చినది.

అవును సార్ ....... విహారి పరమేశ్వరంలు ఎప్పుడో కలిసిపోయారు ....... స్టేజిమీద పద్మాకర్ చావకుండా వుండటానికి కారణం అదే. దిన పత్రిక ఆపు చేసినట్లు పరమేశ్వరం నటించాడు. కానీ నిజానికి నగరంలో పేపర్లు మరింత ఎక్కువగా రిలీజ్ అవటానికి అతడు కొడుక్కి సాయపడుతున్నాడు ....... కృత్రిమమైన మంటలు అని భ్రమ కల్గించి స్వామిని నిజమైన మంటల్లోకి పంపుతున్నాడు.

ఈ రకమైన అర్థం వచ్చేట్టు సాగింది ఆ సంభాషణ.

వణికిపోయాడు.

పరమేశ్వరం అన్ని దిక్కులు పిక్కటిల్లేలా అరవబోయి అతికష్టం మీద తమాయించుకున్నాడు. తనలో తనే ఏదో ఆలోచించుకుంటూ ఆ గదిలోంచి బయటకొచ్చాడు.

**** * *

నాన్నా

నేను చెప్పదల్చుకున్న ఈ కొద్దిమాటలు కాస్త తీరిక చేసుకుని విను. నిన్నెలా కలుసుకోవాలో కలుసుకున్నా నేను చెప్పేమాట నువ్వు వినేలా ఎలా చెయ్యాలో నాకు తోచక ఈ విధంగా క్యాసెట్ ద్వారా పంపుతున్నాను. పూర్తిగా వింటావు కదూ.

అని వస్తున్న మాటల్ని వింటూ రికార్డర్‌వైపు ఆశ్చర్యంగా చూశాడు పరవేశ్వరం.

అతడు ప్రత్యూష సమయాన చాలా సంతృప్తిగా వున్నాడు. ప్రొద్దున్నే పేపర్ రాలేదు. అదొక విషయం. కొడుకు నుంచి ఏ తాకిడీ లేదు. అన్నింటికన్నా ముఖ్యంగా ప్రవల్లిక ఏ హడావుడీ చేయటం లేదు అది మరీ సంతృప్తి.

ఇన్ని ఆనందాల్తో అతడు ఆ భవంతిలో నుండి బయటకొచ్చి అగ్ని పీఠం వేపు నడవబోతుండగా సి.బి.ఐ చీఫ్ వదిలేసిన క్యాసెట్ కనపడింది.

రామ్‌లాల్‌ని అరెస్ట్ చేయటానికి వచ్చినప్పుడు అతడు స్వామికి చూపించిన క్యాసెట్ అది. దాని అధారంగానే రామ్‌లాల్‌ని అరెస్టు చేయటానికి వచ్చాడతను. రామ్‌లాల్ ఏం చెప్పాడో అన్న కుతూహలంతో దాన్ని ఆన్ చేశాడు.

ఆ క్యాసెట్‌లో రామ్‌లాల్ కంఠం వుంటుందనుకున్నాడు.

...... కానీ తన కొడుకుది వుంది.

నాన్నా ఈ క్యాసెట్ నువ్వు వింటావో స్వామి వింటాడో లేక ఇద్దరూ కలిసి వింటారో నాకు తెలీదు. ఇద్దరూ విన్నా పర్వాలేదు. ఒక కొడుకు తండ్రి మాట్లాడే హక్కుని స్వామి కాదనలేడు కదా? అందులో రామ్‌లాల్ మాట్లాడిన మాటలకి బదులు నా మాటలు టేప్ చేశాను. రామ్‌లాల్ మాటల కేముంది నాన్నా? అందులో కొత్త విషయాలేముంటాయి? స్వామి తనకెలా ద్రోహం చేసింది ఆయన్ని తను ఎంతగా నమ్మింది చివరికి తన కాళ్ళూ పోగానే ఎంతగా వంచింపబడింది ఇవేగా వుండేవి ....... !!

నాన్న మనకి విభేదాలు వచ్చిన రోజు కూడా ఇదే చెప్పాను ఈ ప్రపంచంలో సాధారణంగా మనిషికి మనిషికి మధ్య వున్న ఈ వ్యాపార బంధాలే ఆప్యాయత అన్నది దీనికి అంతమైనది ఒక భర్తకి ముసలితనంలో కాన్సరొస్తే భార్య అహర్నిశలూ అతడి పక్కనే వుండి ఎందుకు సేవ చేస్తుంది? నిశ్చయంగా డబ్బుకోసం కాదు, అది నాన్నా ఆప్యాయత అంటే ....... ఒకింట్లో మగవాడు రాత్రింబవళ్ళు కష్టపడి సంపాదించటమే ధ్యేయంగా ఎందుకు పెట్టుకొంటాడు? తన భార్యా పిల్లలు సుఖంగా వుండాలని? అది నాన్నా ప్రేమంటే నువ్వు

ఆరోగ్యం కోసం ఒక నర్సునీ ఇల్లు నీట్‌గా వుంచటం కోసం ఒక పనికుర్రాడిని పెట్టుకోవచ్చు కానీ మొగవాడు వైవాహిక ధర్మాన్నే ఎందుకు ఆశ్రయిస్తున్నాడు? నెలకి రెండుమూడువేల రూపాయలు ఖర్చుతో అన్ని సుఖాలు పొందగలిగే మొగవాడు ఎందుకు ఈ సంసార జంజాటంలో ఇరుక్కుంటున్నాడు.

నాకు తెలిసినంతలో ఒక ఇంటి కోసం ఇక్కడ నా ఉద్దేశం హౌస్ కాదు నాన్నా ....... హవ్స్ ఈజ్ డిఫరెంట్ ఫ్రమ్ హోమ్. ఈ విషయం నీకు తెలియనిది కాదు. దీన్ని సౌలభ్యం కోసం నైతిక బంధం అంటాను.

ఇదే నైతిక బంధాన్ని కొంచెం విస్తృతమైన పరిధిలో చర్చిద్దాము. పాపభీతి వల్ల మారే విధంగా నైతిక విలువల్లో మనిషి కొన్ని బంధాల్ని ఏర్పరచుకున్నాడు. అవే లేకపోతే ఈ ప్రపంచం ఇలా వుండేది కాదు.

నువ్వే వూహించు నాన్నా ఒక కిళ్ళీ కొట్టుకి ముగ్గురు స్నేహితులు వెళ్ళి ఓ వంద చిల్లర ఇమ్మంటారు. షాపు వాడు ఇస్తాడు. నువ్వు వందనోటు ఇవ్వవు. ఇచ్చేశానంటావు వాడేం చేయగలడు నీ వెనుక ఇద్దరున్నారు. అదేగా సాక్ష్యం అంతే అదేనా న్యాయం అంటే .......

నీ వెనుక వున్న ఇద్దర్లో ఒకడు బలవంతుడనుకో ఆ షాపువాడు ఏమైనా గట్టిగా మాట్లాడితే మొత్తం షాపునే నేలమట్టం చేస్తాడు. అదేగా బలం అంటే.

నీ వెనుక వున్న ఇద్దర్లో రెండోవాడు పోలీస్ యూనిఫారంలో వున్నాడనుకో ఆ షాపువాడు ఇంకేం మాట్లాడలేడు. అదేగా అధికారం అంటే .......

చూసేవా నాన్నా నీ స్వామి థియరీని ఎంత చిన్న మాటల్లో చెప్పొచ్చో ....... ఆ రోజు మనింట్లో ఇదే థియరీని తాను స్వయంగా కనుక్కున్నట్టు ఏంతో గర్వంగా చెప్పాడు స్వామి ఇలా మోసం చేయటం ఎంత సులభమో నువ్వే ఆలోచించు.

కానీ నాన్నా

ఇదే వ్యవహారాన్ని ఇంకో కోణంలోంచి ఆలోచిస్తే మధ్యాహ్నం ఎండలో సోడా తాగితే పావలా తగ్గుతుందనే భయంతో రోజంతా రాత్రంతా ఎండలో ....... చలిలో ఒక ఇరుకు కొట్టులో కూర్చుని వంద రూపాయలు సంపాదించిన ఆ కిళ్ళీకొట్టువాడి నుంచి చిన్న ట్రిక్‌తో మన కున్న తెలివితేటల్తో బలం ఆశ్రయంతో అధికారం అండదండల్తో ఆ వంద కొట్టేస్తే .......

నిజంగా తృప్తి వుందా నాన్నా?

ఈ దేశంలో ఇప్పుడు జరుగుతున్నది అదే నాన్నా.